క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య జయంతి



నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో వెలసిన అన్నమయ్య జయంతి వేడుకలను శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే పంచామృతాభిషేకం, విశేష పూజలు, అర్చనలు చేశారు. సంజీవనగర్ శ్రీనివాసనగర్ పురవీధుల్లో అన్నమయ్య సంకీర్తనలు పాడుతూ నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శ్రీభక్తాంజనేయ భజన మండలి వారు అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం జరిపించారు.

నిర్మాణాలు ప్రారంభించక పోతే ఇళ్ల పట్టాలు రద్దు

ఉయ్యాలవాడ : మొదటి విడతలో జగనన్న లేఅవుట్ కాలనీలలో గృహాలు మంజూరై ఇంత వరకు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసేందుకు నోటీసులు అందజేస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని హౌసింగ్ డే పురస్కరించుకుని అల్లూరు గ్రామంలో అధికారుల బృందం పర్యటించింది. లేఅవుట్ కాలనీలోనున్న 12 మంది లబ్ధిదారులను కలిసి నిర్మాణాలు ప్రారంభించాలని పలుమార్లు అవగాహన కల్పించినా వారిలో మార్పు రాకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి పట్టాలు రద్దు చేసేందుకు నోటీసులు అందజేశామని చెప్పారు. ఏఓ రాజేంద్రకుమార్, ఏపీఓ రవిప్రకాష్, ఏపీఎం శేఖర్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షాదిక్‌బాషా, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌రహీమ్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోండి



శిక్షణను చిన్నారులతో కలిసి ప్రారంభిస్తున్న శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల(అర్బన్): శిల్పాసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత సంగీత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్‌పర్సన్ శిల్పా నాగినిరెడ్డి తెలిపారు. స్థానిక సమితి కార్యాలయంలో శనివారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అనుభవం కలిగిన సంగీత గురువు కల్యాణితో శిక్షణ ఇప్పిస్తున్నామని, నేటి తరం చిన్నారులకు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, సంగీతం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు తరగతులను ప్రారంభించామని చెప్పారు.

మహిళా సాధికారతే లక్ష్యం

పేదింటి మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు శిల్పాకుటుంబం నిరంతరం సేవలు అందిస్తుందని, శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్‌పర్సన్ శిల్పా నాగినిరెడ్డి తెలిపారు. స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో శనివారం 169 మంది మహిళలకు రూ.23.51 లక్షల విలువ గల చెక్కులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడ్డ మనోహర్

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం మద్దూరు మెట్ట సమీపంలో హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మనోహర్ తీవ్రంగా గాయపడ్డాడు. మద్దూరు మెట్ట సమీపంలో హైవే పక్కన తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన కొందరు 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి క్షతగాత్రున్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తిని వైఎస్సార్ జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన మనోహర్‌గా గుర్తించారు. చాగలమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నంద్యాల జిల్లా చివరి స్థానంలో నిలవడానికి కారణమైన డీఈఓ అనురాధపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చదువులో నంద్యాల జిల్లాది ఎప్పుడూ ప్రథమ స్థానమేనన్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి వల్లే శనివారం ప్రకటించిన పది పరీక్షా ఫలితాల్లో జిల్లాకు చివరి స్థానం లభించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అకడమిక్ బోధకులను నియమించండి

నంద్యాల(వ్యవసాయం): మదరసాలలో ఫార్మల్ విద్యాబోధనకు అకడమిక్ విద్య బోధకులను నియమించాలని జామాతే ఇస్లామీ హిందూ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ సమత్ తెలిపారు. శనివారం కార్వానే ఉర్దూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008లో సర్వశిక్షా అభియాన్ సహకారంతో నియమించిన విద్య బోధకులను 2019లో తొలగించారన్నారు. ప్రస్తుతం మదరసాలలో బోధకులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలనికోరారు. నిర్వాహకులు మహమ్మద్ ఆరాఫత్, భాజీ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పెద్దకొట్టాల

- గ్రామంలో రూ.2కోట్లతో అభివృద్ధి పనులు

గ్రామం : పెద్దకొట్టాల, **మండలం :** నంద్యాల
జిల్లా : నంద్యాల, **జనాభా :** 5,120,
పురుషులు : 2,621, **మహిళలు :** 2,499
అక్షరాస్యత: 62.09 శాతం
గ్రామస్తుల ప్రధాన వృత్తి : వ్యవసాయం,కూలీ
వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు అందిన సొమ్ము : రూ.14,92,81,249





నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాల, నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం



గ్రామంలో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

నంద్యాల(రూరల్): మండలంలోని పెద్దకొట్టాల గ్రామం ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రూ.2కోట్లకు పైగా వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. గత పాలకులు గ్రామ బాగోగులను పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేది. వివిధ సమస్యలతో స్థానికులు అవస్థలు పడేవారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి చొరవతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో రూ.70లక్షలతో సీసీ రోడ్లు, రూ.15లక్షలతో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి, రూ. 7లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం, రూ.45లక్షలతో నూతన గ్రామ సచివాలయ భవనం, రూ.63 లక్షలతో డ్రైనేజీల ఏర్పాటు పనులు చేపట్టారు.

గతంలో గ్రామాన్ని ఎవరూ పట్టించుకోలేదు



గ్రామ సమస్యలపై గతంలో అనేక సార్లు నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగాం. చివరకు రోడ్డు వేసినా చాలని వేడుకున్నాం. అయినా ఏ నాయకుడు పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో గ్రామంలోని ప్రధాన రహదారిని చక్కగా తయారు చేశారు. వలంటీర్ వ్యవస్థతో మాకు ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయి.
–సరళ, పెద్దకొట్టాల గ్రామం

దళిత కాలనీని అభివృద్ధి చేశారు

నేను తెలుగుదేశం పార్టీ అభిమానిని, అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దళిత కాలనీలను బాగా అభివృద్ధి చేస్తున్నారు. మా కాలనీలో సీసీ రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రవి చొరవతోనే ఇది సాధ్యమైంది. పలుమార్లు మా పార్టీ నాయకులతో కాలనీలోని సమస్యలను ప్రస్తావించినా చూద్దాం లే.. అని సమాధానం చెప్పేవారు. అయినా పనులు చేయలేదు. ఇప్పుడు నేను అనుకున్న దానికన్నా బాగా పనులు చేశారు. ఇక్కడ పార్టీలు ముఖ్యం కాదు. గ్రామాభివృద్ధిని చూసుకోవాలి. అందుకే ఈ ప్రభుత్వం పని చేసిందని చెబుతున్నారు. –విజయ్‌కుమార్, పెద్దకొట్టాల గ్రామం

గ్రామాభివృద్ధే ధ్యేయం



గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. ఇప్పటికే రూ.2కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. గతంలో గ్రామంలోని ప్రధాన రహదారి, పెద్దకొట్టాల–అయ్యలూరు రహదారులు అధ్వానంగా ఉండేవి. గ్రామ నాయకుడు శివనాగిరెడ్డి సహకారంతో సమస్యలను ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే శిల్పా రవి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటున్నాం. ఇంకా మరిన్ని పనులు చేయాలని నిర్ణయించాం. –వెంకటరాముడు, సర్పంచ్

మెడికల్ కళాశాల ఏర్పాటుపై హర్షం

నంద్యాల(అర్బన్): నంద్యాలలో మెడికల్ కళాశాల ఏర్పాటు హర్షణీయమని, ప్రభుత్వ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి స్వాగతిస్తుందని సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలను నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానంలో కాకుండా మరో ప్రాంతంలో ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదన్నారు. కళాశాల ఏర్పాటు ద్వారా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు స్థానికంగా అందే అవకాశం ఉందన్నారు. నాయకులు మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వర నాయుడు, రామిరెడ్డి, సుబ్బయ్య, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య తీర్థప్రసాదాలు అందజేశారు.

'పది'లో మెరిసిన విద్యా కుసుమాలు

- జిల్లాలో అత్యధికంగా నంద్యాల 76.94 శాతం ఉత్తీర్ణత



మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఫలితాలు

మండలం	పాఠశాలల సంఖ్య	పరీక్ష రాసిన విద్యార్థులు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
ఆళ్లగడ్డ	18	801	383	47.82
రుద్రవరం	10	448	201	44.83
శిరివెళ్ల	6	465	189	40.64
దొర్నిపాడు	4	237	124	52.32
ఉయ్యాలవాడ	7	294	159	54
చాగలమర్రి	8	518	239	46
మొత్తం	53	2,763	1,295	46.86

నంద్యాల(సిటీ)/నంద్యాల(రూరల్)/గోస్పాడు: నంద్యాల పట్టణం, మండల పరిధిలోని పాఠశాలల్లో శనివారం విడుదలైన పదవ తరగతి పరీక్షలలో నంద్యాల విద్యా కుసుమాలు మెరిశాయి. 8 ఎయిడెడ్ పాఠశాలల్లో 405 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 228 మంది పాసయ్యారు. వారిలో సెయింట్ జోసఫ్ విద్యార్థిని వైష్ణవికి అత్యధికంగా 583 మార్కులు, ఏపీ మోడల్ స్కూల్‌లో 80 మందికి గాను 60 మంది విద్యార్థులు పాసయ్యారు. రెండు కేజీబీవీ పాఠశాలల్లో 69 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 45 మంది ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని 4 మున్సిపల్ పాఠశాలల్లో 339 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. 5 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 324 మంది పరీక్షలు రాయగా 164 మంది ఉత్తీర్ణత సాధించారు. పట్టణ, మండల పరిధిలోని 44 ప్రైవేటు పాఠశాలల్లో 2,657 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,405 మంది పాసయ్యారు. మొత్తం మీద పట్టణ, మండల పరిధిలోని 65 పాఠశాలల్లో 4,037 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 3,106 మంది ఉత్తీర్ణత సాధించి 76.94 శాతం పాస్ శాతాన్ని నమోదు చేశారు.

గోస్పాడులో....

గోస్పాడు ఏపీ మోడల్ స్కూల్‌లో 90మంది విద్యార్థులకు 69మంది ఉత్తీర్ణులై 77శాతం ఉత్తీర్ణత సాధించారు. యాళ్లూరు జెడ్పీహెచ్‌ఎస్ లో 57మందికి 34మంది పాసై 60శాతం, కేజీబీవీలో 31మందికి 24 మంది ఉత్తీర్ణులై 77.4 శాతం, దీబగుంట్ల హైస్కూల్‌లో 97 మందికి 22 మంది పాసై 23 శాతం, గోస్పాడు హైస్కూల్‌లో 98 మందికి 23 మంది ఉత్తీర్ణులై 23.4శాతం సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో 250 మంది పరీక్షలు రాయగా 150 మంది పాసయ్యారు. వీరిలో 80 మంది బాలికలు ఉన్నారు.

ఆళ్లగడ్డ: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పలువురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. నియోజకవర్గంలో 53 ప్రభుత్వ పాఠశాలల్లో 2,763 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,295 మంది ఉత్తీర్ణ సాధించగా, వీరిలో 57 మంది 500కు పైగా మార్కులు సాధించారు.

శిరివెళ్ల: పదో తరగతి పరీక్షల్లో మండలంలో 50.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో మొత్తం 581 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 295 మంది ఉత్తీర్ణులయ్యారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 88 మందికి గాను 40 మంది (45 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూల్‌లో 86 మందికి 26 (30.39 శాతం), కస్తూర్బాలో 36 మందిలో 17 మంది (49 శాతం) ఉత్తీర్ణులయ్యారు. యర్రగుంట్లలో 99 మందికి 32 మంది (40.4 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గోవిందపల్లెలో 66 మందికి గాను 20 మంది (40.4) ఉత్తీర్ణులయ్యారు. మహదేవపురంలో 27కి గాను 10 మంది (37), వీరారెడ్డిపల్లెలో 27 మందికి ఏడుగురు (33శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ఉయ్యాలవాడ : మండలంలో మొత్తం 294 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయగా 159 మంది ఉత్తీర్ణత సాధించగా 54 శాతం నమోదైందని ఇన్‌చార్జ్ ఎంఈఓ అనురాధ తెలిపారు.

సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు..



పథకాల లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల/నంద్యాల(రూరల్): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 42వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, కౌన్సిలర్ పిల్లి శిరీషతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో కార్యక్రమం చేపట్టి వంద రోజులైన సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, రాష్ట్ర డైరెక్టర్లు సునిత అమృతరాజ్, చంద్రశేఖర్, కౌన్సిలర్లు సాదిక్, కలాం బాషా, హరీఫ్‌నాయక్, సమ్మద్, వార్డు ఇన్‌చార్జి పిల్లి కిరణ్‌కుమార్, నాయకులు కుమ్మరి రాముడు, ఓబులపతి పాల్గొన్నారు.

పెద్దకొట్టాలలో..

మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, నాయకులు, శివనాగిరెడ్డి, రవి, రవి కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరాముడు, బాలశివారెడ్డి, శీలం జగదీశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



అ'పూర్వ' కలయిక

నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

గోస్పాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తరువాత శనివారం అదే పాఠశాలలో మరో సారి కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో 50 మంది పూర్వపు విద్యార్థులు, అప్పటి గురువులు కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు నందీశ్వర్, శర్మ, మౌలాలి, బాబు, మోహన్‌రెడ్డి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అందరు కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

నంద్యాల(అర్బన్): ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ హెచ్చరించారు. స్థానిక సర్వజన వైద్యశాల ఎన్‌సీహెచ్ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లాలోని పీహెచ్‌సీలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, మాతాశిశు సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి గర్భిణికి నాలుగు పరీక్షలు చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ఐరన్, ఫోలిక్ మాత్రలు పంపిణీ చేయాలని, తల్లీబిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ కాంతరావునాయక్, జగదీష్‌చంద్రారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

9న డయల్ యువర్ డీఎం

ఆళ్లగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈ నెల 9వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికుల సలహాలు సూచనలను సెల్ 9959225803 నంబర్‌కి ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

విజ్ఞానం పెంచేందుకు సమ్మర్ క్యాంప్

ఆళ్లగడ్డ: వేసవి సెలవుల్లో చిన్నారుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు 'సెలవుల్లో సరదగా సమ్మర్ క్యాంప్' ఎంతో ఉపయోగ పడుతుందని ఎంఈఓ శోభావివేకవతి అన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 'సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంప్' సంబంధించిన పుస్తకాలు శనివారం మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. ఎంఈఓ మాట్లాడుతూ మండలానికి 2,175 పుస్తకాలు వచ్చాయన్నారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వీటిని ఇళ్ల దగ్గరకు పంపిణీ చేస్తామని చెప్పారు. వారు చదివి రికార్డు చేసి ఉపాధ్యాయుడి మెయిల్‌కు పంపాలన్నారు.

శేషవాహనంపై ఊరేగిన పాండురంగడు



శేషవాహనంపై దర్శనమిస్తున్న పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు శేషవాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు శేష వాహనంపై కొలువుదీరగా పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పాండురంగ విఠలేశ్వరుడు గరుడవాహనంపై భక్తులకు దర్శన మిస్తారని ఆలయ ధర్మకర్త పేర్కొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

ఆళ్లగడ్డ: మండలంలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని చాగలమర్రి ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ తెలిపారు. మండలంలోని చింతలచెరువు, చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామ సచివాలాయలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాయాల్లో హాజరు, మూవ్‌మెంట్, సిబ్బంది విధి నిర్వహణ రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాలలో గ్రంథాలయంలో గెస్ట్ లైబ్రేరియన్ ఉద్యోగానికి తగిన అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఈ ఉద్యోగానికి కనీస అర్హత 55 శాతం మార్కులతో ఎంఎల్ఐఎస్‌సీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ నెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 97040 58507 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఐటీఅండ్‌సీ శాఖ కార్యదర్శి కోనశశిధర్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

బండిఆత్మకూరు: ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చినట్లు ఐటీఅండ్‌సీ శాఖ కార్యదర్శి కోనశశిధర్, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. శనివారం నారాయణాపురం గ్రామంలో దెబ్బతిన్న వరిపంటను వారు పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రబీలో సాగుచేసిన వరిపంట నేలమట్టం అయ్యింది. దీంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న కోనశశిధర్, కలెక్టర్‌లు స్వయంగా గ్రామంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించటంతో పాటు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించారు. ప్రతి గ్రామంలో ఎన్ని హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయో, రైతులకు ఎంతనష్టం వాటిల్లిందో వ్యవసాయ అధికారులు లెక్కించి సమగ్ర వివరాలు పంపించాలని ఆదేశించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల నుంచి గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎం దాసు, తహసీల్దార్ ఉమారాణి, ఆర్‌ఐ సుప్రియ, వీఆర్వో ఏసుపాదం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

రుద్రవరం: మండల కేంద్రానికి చెందిన హేమలత అనే వివాహిత ఫిర్యాదు మేరకు ఏడుగురిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలు.. బాధితురాలికు పదేళ్ల క్రితం మాచినేనిపల్లె గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కొద్ది రోజులుగా కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని వేధించసాగారు. వారి బాధ తాళలేక బాధితురాలు పుట్టింటికి చేరుకొని తల్లిదండ్రుల ద్వారా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో భర్త సురేష్‌తో పాటు అత్త శ్యామల, మామ లక్ష్మయ్య, ఆడపడుచు కళ్యాణి,సువర్ణ,వారి భర్తలు కృష్ణ,శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని బాలస్వామి బావి మెట్ట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దస్తగిరి (55) మృతి చెందాడు. అహోబిలం నుంచి ఆటోలో ఆళ్లగడ్డకు వెళ్తుండగా వెనుక వైపు నుంచి ట్రాక్టరు ఆటోను ఢీ కొంది. ప్రమాదంలో దస్తగిరి,భాస్కర్ తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షత గాత్రులను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే వారిలో దస్తగిరి కోలుకోలేక మృతి చెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.